అనుబంధం

రావినూతల సువర్ణా కన్నన్

మధ్యాహ్నం పన్నెండు గంటల సమయం

రోహిణీ కార్తె ఎండ తన ప్రతాపాన్ని చూపిస్తోంది

ఆదివారం కావడం మూలాన ఎండకి భయపడి పిల్లా పెద్దా అంతా ఇళ్లల్లోనే ఉండిపోయారు

నిర్మానుష్యంగా వున్న రోడ్డుమీద, నడిపీట నావలా నిల్చుండిపోయాడు కోటిగాడు వంటరిగా

''పాలైస్ ! '' అంటూ గట్టిగా అరిచి పిల్లలకోసం ఆశగా చూశాడు

ప్రతిరోజూ వాడి కేక వినగానే చుట్టుముట్టే పిల్లలు ఒక్కరూ ఈరోజు రాలేదు

కారణం ఆ రోజు స్కూల్ లేకపోవడమే

కోటిగాడి ముఖం చిన్నబోయింది !

వాడికి దాదాపు పదేళ్లుంటాయి !

తిండి సరిగ్గా లేకపోయినా ఆదోరకమైన దర్జా కనిపిస్తోంది వాడి ముఖంలో

తల్లి వాడికి తెలియనే తెలియదు— తండ్రి అంతకంటే తెలియదు !

ఒక్క అవ్వ మాత్రం తెలుసు !

ఆమె వాడికి తల్లీ, తండ్రీ !

ఒకే కూతురు, తన బిడ్డని తల్లి చేతుల్లో పెట్టి కన్నుమూస్తే, ఆ పసిగుడ్డును కడుపులో పెట్టుకుని కూతురి మరణపు దుఃఖాన్ని దిగమింగింది అవ్వ

తను కూలికెళ్తూ ఎలాగో ఇన్నాళ్లు వాణ్ణి పెంచింది కానీ వృధ్యాప్యం, హఠాత్తుగా ఆక్రమించేసిన శత్రుసేనలా ఆమెనాక్రమించేసరికి ఇప్పుడు కూలీ నాలీ చేసుకోవడం ఆమెకి కష్టతరమైపోయింది !

అందుకే, ఇటీవల మనవణ్ణి, వాళ్లకాళ్లా వీళ్లకాళ్లు పట్టుకుని ఓ చోట పనికుదిర్చింది

అది బండి మీద అయిస్ ఫ్రూట్స్ అమ్మడం ఉదయం బయల్దేరి సాయంత్రం దాకా అమ్మితే అమ్మినదాన్నిబట్టి కమీషన్ ఇస్తాడు యజమాని

అయితే యజమాని మాత్రం చండశాసనుడు ప్రాణం పోతున్నా ఒక్క పైసా ఇవ్వడు సరిగదా పసివాడు ఓ ఐస్ఫ్రూట్ కావాలని అడిగినా ఇవ్వడు

అందుకే ఆయన స్వభావం తెలిసిన అవ్వా మనవడు అలాంటి ఆశలేం పెట్టుకోరు

అయితే మూడురోజుల నుంచీ అవ్వకు జ్వరంగా వుండి, పన్లోకెళ్ళడంలేదు కోటిగాడు తెచ్చింది ఇద్దరికీ చెరో బన్, టీ నీళ్ళు తప్ప మరేం ఇవ్వలేకపోయింది !

ఈరోజు అదీ దొరికేట్టులేదు

ఉదయం నుంచి రెండు మూడు ఐస్ఫ్రూట్స్ తప్ప అమ్మలేకపోయాడు కోటిగాడు

అరిచి అరిచి నోరు, నడిచి నడిచి కాళ్ళూ పడిపోయాయి

ఎండకి ముఖమంతా కందిపోయింది !

చెప్పుల్లేని కాళ్ళు బొబ్బలెక్కిపోయాయి !

ఆకలితో పేగులు అరుస్తున్నాయి !

చెవులు ఘడియలు పడుతున్నాయి !

అడుగుతీసి అడుగు పెట్టడమే కష్టంగా ఉన్న సమయంలో ఏం చెయ్యాలో ఆ పసివాడికి అర్థంకాలేదు అసలు ఇల్లెలా చేరాలో కూడా తోచలేదు

ఒక్క అయిస్ఫ్రూట్ తినాలని ఎంతగానో అనిపించింది అయితే యజమాని ఉగ్ర నరసింహావతారం గుర్తొచ్చి ఆ ప్రయత్నాన్ని విరమించుకొన్నాడు

నీరసంతో కళ్ళు తిరుగుతున్నట్లనిపించి ఓ విశాలమైన భవంతి ముందున్న పెద్ద చెట్టు నీడలో కూలపడ్డాడు కోటిగాడు

అప్రయత్నంగా ''అమ్మా !'' అన్న పదం అతని లేత పెదవుల నుంచి వెలువడింది

ఎందుకో రూపం తెలియని అమ్మ గుర్తొచ్చి వాడి కళ్ళు నీటితో నిండిపోయాయి !

చిరిగిన చొక్కాతో కళ్ళు, ముఖానికి పట్టిన చెమట తుడుచుకుంటూ, విశాలమైన ఆవరణలో అందంగా, మరింత ఠీవిగా నిల్చున్న ఆ భవనానికేసి చూశాడు

మూసిన ఇనపగేట్లోంచి రకరకాల పూల

అనుబంధం

మొక్కలు బారులుతీరి ఆహ్వానిస్తున్నట్లు కనిపించాయి !

గేటు లోపలివైపు ఘూర్ఖా ఓ చెట్టు నీడన బీడీ వూత్తూ కూర్చున్నాడు

ఓ నౌకరు తోడేల్లాంటి కుక్కకి బిస్కెట్లు తినిపిస్తున్నాడు

పనిమనిషి కాబోలు మెల్లగా గేటు తీసుకుని బైటికొచ్చి చేతిలోని బుట్ట చెత్తకుండీలోకి వంపింది

అన్నం, కూరలు చెత్త చెదారం కలిసిన ఆ కూటికోసం నాలుగు కుక్కలు పరుగున వచ్చి తినబోయి అవి నోటికి చిక్కక కాట్లాడుకుంటున్నాయి

అదంతా చూస్తున్న ఆ చిన్నారి మనసులో ఎన్నో అనుమానాలు !

మరెన్నో ప్రశ్నలు !

జవాబులేని ప్రశ్నలు !

''పెద్ద పెద్ద భవంతులక్కపోయినా తమకి కనీసం మంచి గుడిశైనా లేదెందుకు ?

పంచభక్ష పరమాన్నాలు లేకపోయినా ఆకలి తీర్చుకునేందుకింత అంబలైనా లేదెందుకు ?

శిధిలమైన గుడిశల్లో ఆకలితో, చలితో, తాము ముడుచుకు పడుకుంటే రాజభవనాల్లాంటి ఇళ్ళల్లో పట్టు పరుపుల మీద తిన్నదరక్క పడి దొర్లే బాబులెందుకున్నారు ?

ఆ పాడు దేవుడసలీ తేడా లెందుకు పెట్టాడు ? తోడేల్లాంటి కుక్కకి బ్రతిమాలి బిస్కెట్లు తినిపిస్తుంటే, బక్కచిక్కిన ఈ కుక్కలకి ఈ పాట్లేమిటి ? ఈ మారాజులు కంచాల్లో పారేసిన అన్నంతో తనూ, మామ్మేకాక మరో నలుగురు హాయిగా తిరచ్చే ! అంత నేలపాలు చెయ్యడమెందుకు ?

కనీసం చెల్లాచెదురుగా పారెయ్యకుండా ఓ చోట పెడితే ఆ కుక్కల ఆకలైనా తీరేది కాదా?''

ఆకలికి తట్టుకోలేని ఆ పసి మనసు ఇలా ఆలోచిస్తూంటే –

అదే మేడ పైఅంతస్తులోని ఏ సి రూమ్‌లో పడుకున్న డాక్టరు ఆనందరావు ఏకైక పుత్రరత్నం అయిన పదేళ్ళ రమేష్ పై కిటికీ అద్దాల్లోంచి చెట్టుకింది అయిస్ బండీని చూసి మెల్లగా తల్లి శకుంతల దగ్గరికి చేరాడు –

''మమ్మీ !'' అంటూ

''ఏమిటి ?'' అందామె నిద్రలోంచే

''మమ్మీ ! ఒక్కసారి లే !'' మెల్లగా అన్నాడు రమేష్

''ఏమిటి గొడవ ! పడుకో !'' విసుగ్గా అంది కళ్ళు తెరవకుండానే శకుంతల

''అదికాదమ్మా ! నాకు పాలైస్ కావాలి'' గోముగా అడిగాడు రమేష్

''దానికి నన్నడగడం దేనికి ? వెళ్ళి ఫ్రిజ్ లోంచి తెచ్చుకో !'' అంది మరోవైపుకి వత్తిగిలుతూ

''అది కాదు '' గొణిగాడు రమేష్

''మరేది ? ''

''వీధిలో అమ్మే పాలైస్ కావాలి !'' మెల్లిగా అన్నాడు

''ఏమిటి ?'' అంది శకుంతల కళ్ళు పెద్దవి చేసి ఆమె నిద్రకాస్తా ఎగిరి చక్కాపోయింది.

ఇటీవల మదరాసు విల్లివాకం తెలుగు పఠన మందిరం వారి 21వ వార్షికోత్సవంలో హీరో కృష్ణ ప్రసంగిస్తున్న దృశ్యం శ్రీమతి విజయనిర్మల, శ్రీ ఎల్ వి రామయ్య, డా సి ముద్దు కృష్ణారెడ్డి, డా సి మోహనరెడ్డి గార్లని చిత్రంలో చూడవచ్చు

''వీధిలో అమ్మే పాలైస్ ''

అతని మాట పూర్తికానేలేదు చటుక్కున లేచి కొడుకు నోరు మూసేసింది శకుంతల, ఆ మాట భర్త చెవిని ఎక్కడ పడుతుందో అని అయినా –

''ఏమిటి ?'' అన్నాడు ఆనందరావోసారి కళ్ళు తెరిచి

''అహా ! మరేంలేదు ! మీరు పడుకోండి !'' అనేసి, మెల్లగా లేచి ఫ్రిజ్‌లోంచి అయిస్‌క్రీం తెచ్చి కొడుక్కిచ్చింది శకుంతల

ఎంత మంచి వస్తువైనా వీధిలో కొంటే భర్త కిష్టం వుండదని ఆమెకి బాగా తెలుసు

''ఇది నాకొద్దు ! ఆ పాలైసే కావాలి !'' కిటికీ దగ్గరికొచ్చి మెల్లగా అన్నాడు రమేష్

శకుంతల కూడా కిటికీ దగ్గరికొచ్చి అయిస్‌ఫ్రూట్ బండీని చూసింది

''నా మాట విను నాన్నా ! అసలది నిజంగా పాలైస్ కాదు ! వట్టినీళ్ళతో చేస్తారు ! మనింట్లో వున్నదే ఎంచక్క మంచి అయిస్‌క్రీం !'' నచ్చచెప్పబోయింది

''అయినా నాకదే కావాలి !'' మరీ పసివాడిలా మొండిగా అన్నాడు రమేష్

''ఏమిటీ గొడవ ?'' విసుగ్గా అన్నాడు ఆనందరావు

''డేడీ ! నాకు వీధిలో అమ్మే పాలైస్ కావాలి !'' ఎప్పుడూ లేనంత ధైర్యంగా అడిగాడు రమేష్

తల్లీ కొడుకుల సంభాషణ విన్న ఆనందరావు అంతగా ఆశ్చర్యపోలేదు అందుకే –

''వద్దు నాన్నా ! అలాంటివి తింటే జబ్బులొస్తాయి !'' సౌమ్యంగానే అన్నాడు

''అదికాదు డేడీ ! వాటిమీద మూతుంటుంది నిజం ! కావాలంటే చూడు ! '' అన్నాడు రమేష్

క్షణం ఆలోచనలో పడ్డ ఆనందరావు –

''మనం ఎంచక్కా హోటల్‌కెళ్ళి '' అంటూ ఏదో నచ్చచెప్పబోయాడు

కానీ రమేష్ విన్లేదు !

''ప్లీజ్ ! డేడీ ! ఈ ఒక్కసారి ! ఇంకెప్పుడు అడగనుగా!''అన్నాడు బ్రతిమాలుతూ

నిన్న తన ఫ్రెండ్ సుధీర్ తినడం చూసిన దగ్గర్నించి అతనికా పాలైస్ తినాలని మహ ఆశగా ఉంది

గత్యంతరలేని ఆనందరావు –

''సరే ! వాణ్ణిలా రమ్మను !'' అన్నాడు

రమేష్ ముఖం వెలిగిపోయింది !

శకుంతల తెల్లబోయింది !

''ఆగు ! . ఎండలోకి నువ్వెళ్ళకు ! వాణ్ణే ఇలా మెట్లమీదికి తెమ్మను!'' అన్నాడు ఆనందరావు కొడుకు పరిగెత్తడం చూసి

''వెర్లేదు డేడీ ! ఇప్పుడే వచ్చేస్తానుగా!'' అంటూ నిమిషంలో మాయమయ్యాడు రమేష్

''ఏయ్ పాలైస్ ! ''

నిస్త్రాణగా చెట్టుకానుకుని కూర్చున్న కోటిగాడు తృళ్ళిపడి చూశాడు

''ఏయ్ ! ఇలారా !'' లోపల్నించే చెయ్యి ఊపుతూ అన్నాడు రమేష్

కోటిగాడి కళ్ళు తళుక్కుమన్నాయి !

ఆ పిలుపు వాడికి పన్నీటి చినుకులా తోచింది

ఎక్కడలేని ఓపికా వచ్చింది !

చటుక్కున లేచి ఘూర్ఖా తీసిన గేట్లోంచి పాలైస్ బండిని లోపలికి తీసికెళ్ళాడు

''మంచివేనా ?'' దర్పంగా అడిగాడు రమేష్

''ఆ ! మంచియ్యే బాబుగోరూ ! ఒక్కసారి తింటే మరిడవరు ఎన్నిను ?'' ఉత్సాహంగా అన్నాడు కోటిగాడు

''రెండివ్వు చాలు !'' అన్నాడు రమేష్

కోటిగాడు పెట్టె మూతతీసి రెండయిస్ఫ్రూట్స్ జాగ్రత్తగా తీసి రమేష్‌కిచ్చాడు

''ఆగు !'' అన్న గర్జనకి తృళ్ళిపడ్డారు పిల్లలిద్దరూ

''ఏమిటీ చేతులనిండా ?'' వస్తూ చిరాగ్గా అన్నాడు ఆనందరావు

చేతులు చూసుకున్నాడు కోటిగాడు అవి ఎర్రగా రంగు పూసినట్లున్నాయి

''ఏం నేదు బాబూ ! అయిసుపూటు రంగు !'' తేలిగ్గా అనేశాడు

''ఛ ! ఛ ! డర్టీఫెలో ! అలా చేత్తోనా తీసేది ?'' అసహ్యంగా చూస్తూ అన్నాడు ఆనందరావు

''మరి సేత్తోనేగా బాబూ తియ్యాలా!'' అమాయకంగా అడిగాడు కోటిగాడు

''నోరు ముయ్యి ! వెధవ తెలివి తేటలు ! '' అకారణంగా మండిపడ్డాడు ఆనందరావు

దీనంగా చూశాడు కోటిగాడు

రమేష్ అర్ధరూపాయి బిళ్ళతీసి వాడికి ఇవ్వబోయాడు

''రమేష్ !'' మరోసారి అరిచాడు ఆనందరావు

''ఏమిటి డేడీ ? '' బిత్తరపోయాడా పిల్లాడు

''ఆ అయిస్ అక్కడ పడెయ్ !''

''ఎ ఎందుకు డేడీ ?''

''ముందు చెప్పిన పని చెయ్యి !'' మండిపడ్డాడు ఆనందరావు

''అదేమిటండి ! పిల్చి కొని ఇప్పుడు కాదంటే ఏం బావుంటుంది ? ఆ‹ ! నువ్వెళ్ళు రమేష్! '' అంది శకుంతల కల్పించుకుంటూ

''వీల్లేదు ! ఆ అయిస్ కొనడానికి వీల్లేదు ! ముందు వాణ్ణి అవతలికి గెంటెయ్యి!''

కొడుకు చేతిలోని ఐస్‌ఫ్రూట్స్ రెండూ లాక్కుని పెట్టెమీద పడేశాడు ఆనందరావు

''బాబూ ! సెయ్యి కడుక్కుని మళ్లీ తీసిత్తాను !'' కంగారుగా అన్నాడు కోటిగాడు

వాడికా బేరం ఎక్కడపోతుందో అన్న బెంగ నరనరాల్నీ ఒణికించేలా చేస్తోంది

''అవసరం లేదు ! నువ్వెళ్ళిపో !'' కఠినంగా అనేసి వెనుతిరిగాడు ఆనందరావు

భర్త ప్రవర్తనకి విస్తుపోయింది శకుంతల

రమేష్ కొత్త వ్యక్తిని చూస్తున్నట్టు చూస్తూండిపోయాడు, తండ్రిని

కోటిగాడు కృంగిపోయాడు

వాడిలోని అవసరం అభిమానాన్ని అవతలికి నెట్టింది

''బాబుగోరూ! అలా అనొద్దు బాబుగోరూ! పొద్దున్నించీ ఏం తిన్లేదు ! అన్నం తిని మూడ్రోజులైంది ! మా యవ్వకు జొరం ! '' అన్నాడు దయనీయంగా

వాడి మాటలు విన్న ఆనందరావుకి జాలికన్నా కోపమే ఎక్కువ వచ్చింది

''అయితే ఏమంటావ్ ?'' అన్నాడు కఠినంగా

''తఁవఁరియ్యి కొంటే ఓ అద్ద రూపాయొస్తది అయ్యేట్టే నేనూ, మా మామ్మ టీ నీల్లు తాగుతాం'' వాడి కళ్ళలో నీళ్ళూరి టపటప చొక్కామీదికి రాల్తున్నాయి

''అయితే ఇది తీసుకో ! అంతేగానీ నీ వెధవచేతి తిండి మా కక్కర్లేదు !'' అర్ధ రూపాయి బిళ్ల విసిరేస్తూ మేడ మెట్లవైపు తిరిగాడు ఆనందరావు

ఆ నాణెం వాడి ముఖానికి తగిలి నుదుట పెద్ద బొప్పికట్టింది

కోటిగాడిలో అభిమానం పొంగింది!

ఆశ కృంగింది !

నిరాశ ఆకలిని రెచ్చగొట్టింది !

ఆ ఆకలి ఆవేశాన్ని తట్టిలేపింది !

ఆవేశం ఉచితానుచితాల్ని మర్చిపోయింది !

''ఉంచుకో ! అదీ నువ్వే వుంచుకో ! కాదంటే ఏ బిచ్చగాడికో దానం చేసుకో ! నాకు తిండి లేకపోయినా అబిమానం ఉంది! నీలా లచ్చలు నేపోయినా లచ్చలు సేసే దయాగునం ఉంది ! ఇంతమంది నౌకర్లు నేపోయినా కొండంత మామ్ముంది ! మేం తినకపోయినా కూసంతుంటే, పసిపాణం ఆకలితో అల్లాడిపోతుంటే సూస్తూ ఊరుకొం ! అలాటిది లచ్చలుండి ఓ అద్దరూపాయ్ కాడ యనకాడావ్ ! నువ్వా ఓ మొగాడివే ! కట్టు ! మరో మేడ కట్టు ! ''



తన్నుకొస్తున్న దుఃఖాన్ని బలవంతంగా దిగమింగుతూ ఆవేశంగా అరిచి బండి మీద చేతు లేశాడు కోటి తోసుకెళ్లడానికి అంతే! వాడు వెళ్లి అల్లంత దూరాన పడ్డాడు

అయిస్‌ఫ్రూట్సన్నీ నేలపాలైపోయాయి!

"రాస్కెల్! ఏంకూశావ్‌రా? పైసాకి గతిలేని వెధవ్వి! నన్ను పట్టుకుని ఇన్ని మాట్లంటావ్‌రా నువ్వెంత! నీ బతు కెంత! నిన్నీ రోడ్డుమీద పడేసి పిచ్చికుక్కని కొట్టినట్టు కొడితే నీ తాతెవడొస్తాడో చూస్తాను!" అంటూ ఆవేశంగా ఎడాపెడా బాదేశాడు ఆనందరావు

"ఏమిటీ అన్యాయం?" శకుంతల అడ్డం వచ్చింది

"నువ్వురే! ఇవాళ వీడి రక్తం కళ్ల చూస్తాను! ఆఫ్‌ట్రాల్! వెధవ వేలెడు లేడు నన్నింతలేసి మాటలంటాడా!" లుంగలు చుట్టుకుపోతున్న వాడి కాలర్ పట్టుకుని లేవదీసి మరి నాలుగు దెబ్బలు వేశాడు

శకుంతల లోని మాతృత్వం ఈ అన్యాయాన్ని సహించలేకపోయింది

"ఏమిటి? మీకేమైనా మతిపోయిందా? అన్నం పున్నెం తెలియని పసివెధవ ఏదో ఆకలి బాధతో అంటే ఇన్నేళ్ళొచ్చి దయ, జాలి అన్న పదాల కర్థం మర్చిపోయి అలా కొడతారా? ఇప్పుడు వాడికేమైనా అయితే? నిజమైన బాధతో ఎవరైనాఅంటే అది మనకి కచ్చితంగా తగిలి తీరుతుంది జాగ్రత్త!" కాళిలా అరుస్తున్న శకుంతలని ఆనందరావు, రమేషే కాక నౌకర్లంతా కూడా వింతగా చూస్తూండి పోయారు!

కోటిగాడికి మాత్రం అవేం వినిపించడం లేదు! కనిపించడం లేదు!

దాదాపు స్పృహలేనట్టు పడివున్న వాడి కళ్ళకి నేలపాలైన పాలైస్‌లు మాత్రం దీనంగా కనిపిస్తున్నాయి!

వాడికి దెబ్బల బాధగానీ, ఆకలి బాధగానీ అస్సలు గుర్తులేవు!

వాడికి గుర్తున్నదల్లా యజమాని రూపం!

ఆగ్రహంతో మండిపడే రూపం!

వాలిపోతున్న కళ్ళు ఓసారి తెరిచి అయిస్ బండికేసి చూశాడు

అయిస్ కరిగి ఆ ప్రాంతమంతా తడిగా అయిపోతోంది

ఎలాగైనా లేచి మిగిలినవాటిని ఏరి డబ్బాలో వేసుకుందామని అనుకున్నా వాడి శరీరం వాడి మాట వినడం లేదు!

అవ్వ ఎంతసేపటికి మనవడు రాకపోవడంతో ఆ జ్వరంతోనే, క్రరసాయంతో వాణ్ణి వెతు క్కుంటూ వచ్చి, ఆ పరిస్థితుల్లో వున్న మనవణ్ణి చూసి బోరుమంది!

అనుబంధం

"ఏందయ్యా! ఏం జరిగింది?" అంది వాణ్ణి ఒళ్ళోకి తీసుకుంటూ

"ఏం జరిగిందా? వీడికి పొగరెక్కింది! వాడి దరిద్రపు అయిసు కొన్లేదని నానా మాటలూ అన్నాడు

నా సంగతెర్తుల్సుగా? తల్చుకుంటే ఊరి పొలిమేరలు దాటించెయ్యకలను! జాగత్త!" ఉరిమినట్టు అన్నాడు ఆనందరావు

అవ్వని చూశాక అతని ఆవేశం మరింత పెరిగింది!

"ఏటి నానా! అలా అన్నావా?" మెల్లగా వాడి తల నిమురుతూ అంది అవ్వ

లేదన్నట్టు తల అడ్డంగా ఊపాడు కోటిగాడు

అవ్వని చూశాక వాడి దుఃఖం రెట్టిం పయింది

మిగిలేది

స్పష్టాస్పష్టతల నడుమ
హోయలు పోయే కవిత్వం
సూటిగా మోటుగా
మొనదేలగానే
మిగిలేది ఘాటు
తప్పకునేది ఆవేశం!

— నిఖిల్

"అయితే నేనబద్ధం ఆడానంటావా? దార్నిపోయే తద్దినాన్ని కోరి తెచ్చుకున్నా నంటావా?" అరిచాడు ఆనందరావు

"లేదు బాబూ! ఏదో సిన్నోడు? తంవ్రు కోపం సేసుకోకండి బాబూ!" సర్ది చెప్పింది తగూలంటే భయపడే అవ్వ

"అవునే! సిన్నోడే! మరి సిన్నోడైతే ఆ పెద్ద మాటెందుకే? ఇదిగో! ఇదే చెప్తున్నాను! ఈ పరిసరాల్లోకి ఇంకెప్పుడైనా వచ్చారో"

"అట్టా! ఇంకెప్పుడు రాం బాబూ!" అతని మాట పూర్తి కాకుండానే కంగారుగా అనేసింది అవ్వ

"ఇలా చెప్పడం ఎన్నోసారి! అలగా జన్మా! అలగా బుద్దులు!" ఓ సారి ఏవగింపుగా అవ్వా మనవళ్ళకేసిచూసి కొడుకుతో సహా లోపలికెళ్ళి ధఢాల్న తలుపు మూసు కున్నాడు ఆనందరావు

అతను వెళ్ళగానే—

"నాన్నా! కోటే!!" పొంగి వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ అంది అవ్వ వాడి తల మీది గాయం ఆమెకి కంగారు పెడుతోంది!

"ఏమిటి?" అన్నట్టు చూశాడు కోటిగాడు

"ఇంటికెల్దాం పద!" గాయాన్ని కొంగుతో తుడుస్తూ అంది

"కా నీ పాలైస్!" దుఃఖంతో వాడిగొంతు పెగల్లేదు.

అవ్వకి కూడా ఏడుపు ఆగడం లేదు కానీ —

"పోన్లే నానా! ఏం చేస్తాం! అయినా నువ్వలా అనకూడదయ్యా! ఆళ్ల పెద్దోల్లు! ఆరు కోపం చేసేత్తే మనం బుగ్గయి పోవూ?" అంది మెల్లగా

"అది కాదవ్వా! ఆ బాబు"

"నాకుతెల్సు నాన్నా పద! ఇంకెప్పుడూ ఇట్టామాక! ఒచ్చినా ఈ ఇంటి కాడికి అసలు రామాక లెగు! మెల్లగా ఇంటికెల్దాం! మీ అయ్యగారితో నే సెప్పుకుంటాను! పాలైసుల ఇసయం!"

వాడి కళ్ల నిండా నీళ్లు!

వాడి వళ్ళంతా దుమ్ము!

వాడి బట్టలంతా రక్తపు మరకలు!

మెల్లగా ఓపిక చేసుకుని లేవబోయాడు

"కూర్చో! ఇది తిను!" మెల్లిగా ఓ ఆకులో టిఫిన్ అందించింది శకుంతల

"వద్దు!" అన్నట్టు తల తిప్పాడు కోటిగాడు

వాడిలోని అభిమానానికి విస్తుబోయింది శకుంతల బలవంతంగా వాడిచేత తినిపించింది

"నీ పేరు రాజవ్వ కదూ?" అంది హఠాత్తుగా

తృప్తిపడ్డ అవ్వ "అవునమ్మా!"అనేసింది

ఓసారి కోటిగాడికేసి చూసి దీర్ఘంగా నిట్టూర్చి లోనికెళ్ళి ఓ పళ్ళెంనిండా అన్నం, కూరలు తెచ్చి —

"ఇదిగో అవ్వా! ఇది తీసికెళ్ళి తినండి! కాదనకు!" అంది మెల్లగా

"అమ్మా!" ఆశ్చర్యంగా చూసింది అవ్వ

"నీ పరిస్థితి నాకు తెలుసవ్వా! కాని నేనాయన భార్యని! ఎంతటి విషాన్నయినా దిగమింగెయ్యాలి!" అంటుంటే ఆమె కంఠం ఒణికింది

ఆమెకేసి అవ్వ జాలిగా చూసింది

"ఇంద ఈ రెండొందలు వుంచు! ఎప్పుడైనా అవసరం అయితే నన్నడగడానికి సందేహించకు! కానీ ఒక్కటి గుర్తుంచుకో! ఈ సంగతి మనిద్దరి మధ్యే వుండాలి!"

బలవంతంగా రెండు నోట్లు చేతిలో కుక్కి ఎవరో తరుముతున్నట్టు లోనికి పరిగెత్తింది శకుంతల

"ఏటి మాయమ్మా! అమ్మగోరు అంత

ధర్మపథం

బులుసు వేంకటరమణయ్య

అక్షరాల మార్పు.

మనం ఏ విషయాన్నయినా వ్రాసేటప్పుడు మన వ్రాత మన అభిప్రాయానికి అనుకూలంగా వుందా? లేదా? అని ఆలోచించి, మరీ జాగ్రత్తగా వ్రాయాలి మనం సరిగా వ్రాసినా అక్షరాల మార్పిడికి అవకాశం వున్నట్లయితే, ఇతరులు అక్షరాలు మార్చి విరుద్ధాభిప్రాయాన్ని కలిగించే ప్రమాదం ఉన్నది దీనికొక ఉదాహరణ —

పసిబాలుడూ, రాజకుమారుడూ అయిన చంద్రహాసుడు అడవిలో దిక్కులేని స్థితిలో ఉండగా – ఆటవికులకు రాజైన పుళిందుడు చేరదీసి పెంచి పెద్దచేశాడు పుళిందుడు పొరుగున ఉన్న రాజునకు సామంతుడు ఆయనకు పన్ను చెల్లిస్తూ ఉంటాడు ఆ రాజుకు మగ సంతానం లేదు ఒకే ఒక కుమార్తె ఆతని మంత్రి దుష్టబుద్ధి పేరుకు తగినట్లే క్రూర స్వభావుడూ, స్వార్థపరుడున్నూ ఎలాగయినా తన కుమారుడికి రాజపుత్రికతో వివాహం జరిపించి, ఆ రాజ్యానికి తానే ఉత్తరాధికారి కావాలనే ఆలోచన అతనికి ఉన్నది

ఒకప్పుడు పన్ను వసూలు చెయ్యడానికి దుష్టబుద్ధే స్వయంగా పుళిందుడి వద్దకు వచ్చాడు చంద్రహాసుణ్ణి చూచి "ఈ అబ్బాయి ఎవరు? నీకు కొడుకులు లేరు గదా!" అని పుళిందుణ్ణి అడిగాడు అడవిలో దిక్కులేని స్థితిలో దొరకగా, తాను పెంచి పెద్ద చేశాననీ, గొప్ప అదృష్టజాతకుడనీ, ఆ రాజ్యానికి రాజు కాగలడనీ జ్యోతిష్కులు చెప్పారనీ అతడు తెలియజేశాడు దుష్టబుద్ధి గుండెల్లో రాయిపడింది చంద్రహాసుణ్ణి శీఘ్రంగా తుదముట్టించాలని నిశ్చయించాడు

దుష్టబుద్ధి చంద్రహాసునిపట్ల గాఢమైన ప్రేమ నటిస్తూ "నాయనా! నీవే నాకు విశ్వాసపాత్రుడవు నీకొక ఉత్తరం ఇస్తాను వెంటనే రాజధానికి వెళ్ళి నా కుమారునికి ఇది ఇయ్యి ఈ లేఖను విప్పకూడదు సుమా! నీకు మేలు కలుగుతుంది" అని చెప్పి లేఖను ఇచ్చాడు చంద్రహాసుడు దాన్ని అంగీ జేబులో భద్రంగా ఉంచుకుని ఆ వూరికి వెళ్ళి శ్రమ తీర్చుకోడానికి నగరం ప్రక్క ఉన్న పూలతోటలో కొంచెంసేపు విశ్రమించాడు వెంటనే నిద్ర పట్టింది

ఆ సమయంలో దుష్టబుద్ధి కుమార్తె విషయ, చెలికత్తెలతో కూడా వన విహారానికి అక్కడికి వచ్చింది ఆమె మంచి స్వభావం కలది తండ్రి బుద్ధులు ఆమెకు కిట్టవు నిద్రలో ఉన్న చంద్రహాసుని చక్కదనం ఆమెను ఆకర్షించింది ఆమె, అతని అంగీ జేబులోని లేఖను మెల్లగా తీసి, జాగ్రత్తగా తిప్పింది అది ఆమె తండ్రి కుమారునికి వ్రాసిన లేఖ అని వెంటనే గుర్తించి చదువుకొన్నది అందులో చివర, ముఖ్య విషయమంటూ "వీడు నా కమిత్రుడు వెంటనే విషమునిమ్ము" అని ఉన్నది ఆమెకు ఆశ్చర్యం కలిగింది తండ్రి చెడ్డబుద్ధికి అసహ్యపడి 'నా కమిత్రుడు' అనేచోట 'క'ను 'కు'గా మార్చి, 'విషము' అన్నచోట 'ము'కు బదులుగా 'య'ను దిద్దింది "వీడు నాకు మిత్రుడు, వెంటనే విషయనిమ్ము" అని తయారయింది ఆమె తిరిగి ఆ లేఖను అతికించి, అతని జేబులో పెట్టింది నిద్ర లేచిన చంద్రహాసుడు మంత్రి యింటికి వెళ్ళి మంత్రి కుమారునికి ఆ లేఖ యిచ్చాడు అతడు, తగిన వరుడు దొరికినందుకు సంతోషించి తక్షణం పెండ్లి ఏర్పాట్లు చేసి, తన సోదరిని అతనికిచ్చి పెండ్లి చేశాడు

ఇట్లు దుష్టబుద్ధి కోరికకు విరుద్ధంగా జరిగింది అక్షరాల మార్పే గదా దీనికి కారణం!

ఈ విధంగా అక్షరాల మార్పువల్ల చెడ్డది మంచిగా మారినట్లు, 'పరుల కుపకారం చెయ్యవలెను' అనేది 'పరుల కపకారం చెయ్యవలె'నని ఉంటే విపరీతార్థం కలుగుతుంది ★

డబ్బిచ్చారూ?" వింతగా చూస్తూ అన్నాడు కోటిగాడు

త్రుళ్ళిపడింది అవ్వ!

"నిన్నెడా పెడా కొట్టి, నీ రకతం కళ్ల జూసిన ఆ పెద్దమడిసి, నిన్ను కన్న నీ బాబేరా! పాసిపని సేసే మీ యమ్మని మోసంసేసి నీ జన్మకి కారనం అయి, గాన్నట్టేట్లో ముంచడవే గాక మనల్ని వూర్నించి ఎల్లగొట్టడానికి సూశాడ్రా ఈ దరమపెబువు! ఇటేపు రానని పెమాణం సేయించుకున్నాకగానీ వూరుకో నేదురా!

అందుకే అటూత్తుగా నువ్వు కనిపించేసరికి తన పాపం గుర్తొచ్చి శివాలాడాడు! పిచ్చోడా! మంచి బట్టేస్తె నువ్వూ ఆ రమేష్‌బాబులా వుంటావని అందరికీ తెలుసురా! ఈ కదంతా తెలిసిన ఆ దరమతల్లి జాలిపడిందిరా! పోలికబట్టి నిన్నూ, పేర్నట్టి నన్నూ గుర్తుట్టి జాలడి ఇచ్చిందిరా నానా!" అని చెప్పాలనుకుంది కానీ చెప్పలేదు! అలాచెప్తే ఆ పసివాడి మనసులో ఒకలాంటి ప్రేమో, లేక ఆశో, అదీగాక తల్లిని మోసం చేసినందుకు కక్షో బయల్దేరుతుందనీ, అది అనేక అనర్థాలకి దారితీస్తుందనీ ఆమెకి తెలుసు అందుకే –

"ఆయమ్మది జాలిగుండె నానా! మా దొడ్డ ఇల్లాలని ఇన్నాను! ఇప్పుడు సూత్తన్నాను!" రెండు చేతులు జోడించి మేడకేసి చూస్తూ అంది అవ్వ

కోటిగాడు కూడా ఆరాధనగా నమస్కరించి లేచాడు

మనవణ్ణి పొదివి పట్టుకుని తూలుతూ వెళ్ళిపోతున్న అవ్వని పై అంతస్తులోంచి చూస్తున్న శకుంతల కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి!

ఏదో సినిమాలోని సంఘటన గుర్తొచ్చిందామెకి

తండ్రీ కొడుకులని తెలియకుండానే ఒకర్ని చూసి ఒకరు తన్మయత్వంగా చూసుకుంటారు అదే "రక్తసంబంధం" అని తేల్చాడు కథకుడు!

కానీ అది సినిమా!

ఇది? నిజజీవితం!

సిరిసంపదలముందు, పేరుప్రఖ్యాతుల ముందు, ఈ బంధాలు తారుమారవుతాయి!

సమయానుకూలంగా మారుతూంటాయ్!

మరోసారి భారంగా నిట్టూర్చింది శకుంతల

"అనుబంధం ఆత్మీయత అంతా ఒక బూటకం ఆత్మతృప్తికై మనుషులు ఆడుకునే నాటకం వింత నాటకం"

పాట ఎక్కణ్ణించో విషాదంగా వినిపిస్తోంది! ★